మన చౌరాస్తా
తెలుగు దినపత్రిక


వైభవంగా సోమన్న కల్యాణం | 2

సంపుటి : 01 | సంచిక : 80 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | సోమవారం, 16 ఫిబ్రవరి 2026 | పేజీలు : 4




# టీ-20 కాదు..
# JN-30

జనగామ మున్సిపల్ ఎన్నికల తుది ఘట్టమైన చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికకు రంగం సిద్ధమైంది. నేడు (సోమవారం) ఉదయం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే ఎన్నికకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ ఎన్నికను పూర్తి చేసేందుకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా స్థానిక ఆర్డీవో గోపీరాంకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆర్డీవో ఆదివారం మున్సిపల్ ఆఫీస్‌లో జరుగుతున్న ఏర్పాట్లు పరిశీలించారు.

## పార్టీ వారీగా సీట్లు...

మున్సిపల్ కార్యాలయంలో నేడు జరిగే ఎన్నికకు హాజరయ్యే కౌన్సిల్ సభ్యులకు పార్టీ వారిగా సీట్లు కేటాయించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ సభ్యులతో పాటు స్వతంత్ర అభ్యర్థులకు సపరేటుగా సీట్లు కెటాయించారు.

## ఎవరు ఎటువైపో...

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్‌కు 13 చొప్పున సమాన సీట్లు వచ్చారు. నలుగురు స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. స్వతంత్రుల్లో ఇద్దరు బీఆర్ఎస్‌కు, మరో ఇద్దరు కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నట్టు తెలుస్తోంది. ఈ రెండు ఓటింగ్ పూర్తయిన రోజు రాత్రి వరకు క్యాంపులు నిర్వహించి అభ్యర్థులు తమ పట్టులో నుంచి వెళ్లకుండా జాగ్రత్త పడ్డారు. స్వతంత్ర అభ్యర్థలతో కలిసి కాంగ్రెస్, బీఆర్ఎస్ 15 మంది చొప్పున కౌన్సిలర్లు అవుతుండగా.. ఎక్స్ అఫీయో మెంబర్లుగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి ఓటు నమోదు చేసుకున్నారు. దీంతో ఇరు పార్టీల మెజార్టీ 16 : 16గా మారింది.




- క్రికెట్ మ్యాచ్‌ను తలపిస్తున్న జనగామ మున్సిపాలిటీ
- చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నికపై తీవ్ర ఉత్కంఠ
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- నువ్వానేనా.. అంటున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
- స్వతంత్ర అభ్యర్థులే కీలకం..
- జేఎన్ 30 మ్యాచ్‌లో ఎన్నిక జరిగేనా.. టై.. అయ్యేనా..!

టీ 20 క్రికెట్మ్యాచ్ అంటే.. అంత ఆషామాషీ కాదు.. ఉత్కంఠకు మారు పేరు టీ 20 క్రికెట్.. 'ఒక్క బాల్.. ఒక్క రన్..' కొడితే విజయం సిద్ధిస్తుంది.. అన్న సమయంలో మైదానంలో ఉన్న ఆటగాడికంటే చూసే ప్రేక్షకుల టెన్షన్ అంతా ఇంతా కాదు.. ప్రస్తుతం జనగామ మున్సిపాటీ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక కూడా టీ 20 క్రికెట్ మించిన టెన్షన్ ఉందనడంలో సందేహం లేదు.. అందుకే ఇది.. 'టీ 20 కాదు.. జేఎన్ 30' అంటూ జనం లెక్కలేసుకుంటూ నేడు జరిగే మున్సిపల్ చైర్మన్ ఎన్నిక కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. - ఉప్పలంచి నరేందర్, మన చౌరాస్తా

## హాజరు అనివార్యమే..!

చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు 32 మంది ఓటు వేయాల్సి ఉండగా.. ఇందులో సగం 16 మంది కోరం ఉంటే ఎన్నిక ప్రక్రియను అధికారులు పూర్తి చేస్తారు. అయితే ఇరు పార్టీలకు సమాన బలాలు ఉండడంతో ఏ ఒక్క పార్టీ వారు నేటి సమావేశానికి హాజరైనా చైర్మన్ ఎన్నిక జరిగిపోతుంది. ఈ క్రమంలో రెండు పార్టీల హాజరు అనివార్యంగా మారింది. ఇలా మొత్తం సభ్యులు హాజరై తమ ఓటు వారు అనుకున్న విధంగా వినియోగించుకుంటే.. 'జేఎన్ 30 మ్యాచ్..' (చైర్మన్ ఎన్నిక) టై.. అయినట్టే..! లేదా.. ఎవరైనా అభ్యర్థులు లోపాయికారిగా ఒప్పందాలు చేసుకుని ఓటింగ్ టైంలో ప్రత్యర్థులకు అనుకూలంగా ఓటేస్తే ఎన్నిక పూర్తి అవుతుంది.



## భారీ బందోబస్తు..

జనగామ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక నేపథ్యంలో మున్సిపల్ ఆఫీస్ వద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు పార్టీ కౌన్సిల్ సభ్యులు నేడు సమావేశానికి హాజరయ్యే క్రమంలో ప్రత్యర్థులు వారిని కిడ్నాప్ చేసేందుకు వెనుకాడరనే కోణంలో పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. జనగామ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్ నితిన్ ఆదివారం భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఇక కౌన్సిల్లో జరిగే ఎన్నిక ప్రక్రియను చూసేందుకు మీడియా కూడా ఓ ప్రత్యేక గ్యాలరీ ఏర్పాటు చేశారు.





# వైభవంగా సోమన్న కల్యాణం

- **పట్టు వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**
- **కిటకిటాడిన సోమేశ్వరాలయం**



**పాలకుర్తి, మన చౌరాస్తా :** మహాశివరాత్రి సందర్భంగా ఆలయాలు శివనామ స్మరణలతో మారుమోగినాయి. పాలకుర్తి లో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమేశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. ప్రధాన వీధులతో పాటు రాజీవ్ చౌరస్తా నుంచి గుడివాడ చౌరస్తా వరకు భక్తుల జనసంచారం రాత్రంతా కనిపించింది. కళ్యాణోత్సవాన్ని లక్ష మంది తిలకించారు. ఆదివారం ఒక్కరోజే సుమారు రెండు లక్షల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు తెలుస్తోంది. భక్తులు తాకిడితో దర్శనానికి సుమారు 8 గంటల సమయం పట్టింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమేశ్వరాలయంలో కల్యాణోత్సవాన్ని ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. స్వామివార్లకు ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం వేద పండితులు, అర్చకులు కల్యాణోత్సవాన్ని నిర్వహించారు.









## వేయి స్తంభాల గుడిలో సీపీ పూజలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ మహాశివరాత్రి పురస్కరించుకుని హనుమకొండలోని వేయి స్తంభాల దేవాలయాన్ని సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి చేరుకున్న ఆయన, రుద్రేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. వేద పండితులు సీపీ దంపతులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వచనం పలికారు. సీపీ మాట్లాడుతూ.. స్వామివారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.



## ఘనంగా పొన్నాల జన్మదిన వేడుకులు

**జనగామ, మన చౌరాస్తా :** మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య జన్మదిన వేడకలను జనగామలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ధర్మపురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఓల్డ్ ఏజ్ హోం (వృద్ధుల ఆశ్రమం )లో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే చంపక్ హిల్స్ దగ్గర మాతా శిశు హాస్పిటల్ వద్ద కూడా అన్నదానం చేశారు. అనంతరం రాజరాజేశ్వరి వృద్ధాశ్రమానికి సీలింగ్ ఫ్యాన్లు, కుర్చీలు అందజేశారు. అదేవిధంగా కాశీ వారణాసి, ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీశైలంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. జనగామలో జరిగిన కార్యక్రమంలో సౌడ మహేష్, రఘు ఠాగూర్, అయ్యప్ప రాజు, ఎండి ఫయాజ్, సుల్తాన్, గోవింద్ రెడ్డి, శివకుమార్, ప్రవీణ్, ఎండి ఆజాం, వెంకన్న పాల్గొన్నారు.

## సేవాలాల్ జయంతి వేడుకలు

**హనుమకొండ, మన చౌరాస్తా :** బాలాజీ, బంజారా కాలనీ, గుండ్ల సింగారం సేవాలాల్ ప్రాంగణంలో సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలను బంజారా పెద్దలు, నాయకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. మహిళలు, బంజారా సోదర సోదరీమణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భోగ్ బండార్ నిర్వహించారు. రవి నాయక్, రాజు నాయక్, జవహర్లాల్, లాలూ నాయక్, వీ ఎన్ నాయక్, రమేష్ మాట్లాడుతూ.. సేవాలాల్ బంజారా సమాజానికి మార్గదర్శకుడు, ఆధ్యాత్మిక దిక్సూచి అని కొనియాడారు.



# పలు ఆలయాలను సందర్శించిన మంత్రి పొన్నం








హుస్నాబాద్, మన చౌరాస్తా : మహా శివరాత్రి సందర్భంగా పొన్నం ప్రభాకర్ పొట్లపల్లి గ్రామంలోని స్వయంభూ శ్రీ రాజ రాజేశ్వర స్వామి ఆలయంను సందర్శించి స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు కోరుకున్నారు. సిద్దిపేట జిల్లాలోని హుస్నాబాద్ నియోజకవర్గం పరిధిలో ఉన్న పొట్లపల్లి గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు, భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్ ప్రాంతం సస్యశ్యామలంగా ఉండాలని, మంచి వర్షాలతో పాడి పంటలు పండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. వచ్చే మహా శివరాత్రి నాటికి గౌరవెల్లి ప్రాజెక్ట్ పూర్తై కాలువల ద్వారా నీరు చేరి ఈ ప్రాంతం మరింత పచ్చదనంతో కళకళలాడాలని కోరుకున్నట్లు చెప్పారు. అలాగే ప్రజా పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఎలాంటి అవరోధాలు లేకుండా కొనసాగాలని, భవిష్యత్‌లో మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరువయ్యేలా భగవంతుడు ఆశీర్వదించాలని ప్రార్థించినట్లు మంత్రి పేర్కొన్నారు.



# వంగర శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

**భీమదేవరపల్లి, మన చౌరాస్తా :** మండలం పరిధిలోని వంగర గ్రామంలోని వంగర శివాలయంలో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి పాల్గొని శివలింగానికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం ప్రజల జీవితాల్లో శాంతి, ఆరోగ్యం, సుఖసంతోషాలు నింపాలని, గ్రామం సర్వతోముఖ అభివృద్ధి సాధించాలని పరమేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. పూజా కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తి శ్రద్ధలతో సేవలు నిర్వహించారు. భక్తుల రద్దీతో ఆలయం ఆధ్యాత్మిక వాతావరణంలో నిండిపోయింది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక అభిషేకాలు, పూజలు, భజనలు గ్రామంలో భక్తి పరవశాన్ని నింపాయి.





# wanted

## విలేకరులు కావలెను




మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సంప్రదించగలరు.

**manachourasta@gmail.com**

**8555800812** **9676400812**

Printed and Published by **UPPALANCHI POORNIMA** on behalf of UPPALANCHI POORNIMA, Printed at Hamara Warangal Printers and Graphics H.no.25-8-182, Balaji Nagar, Kazipet, Warangal, 506003., Published at H.No.4-8-65, Dharmakancha, Jangaon, Jangaon District. Telangana, 506167, Editor : **UPPALANCHI NARENDER**. Ph : **8555800812**, RNI : **TGTEL/25/A4350**